క్లుప్తంగా

నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం

డీఎస్పీ నాగేశ్వరరావు



శావల్యాపురం: నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో దోహదపడుతుందని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సారథ్యంలో 34 పోలీసు స్టేషన్లలో మీతో మేము కార్యక్రమంలో భాగంగా సైబరు నేరాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ వలన జరిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం పెంపొదించటానికి వీలుగా వర్టికల్ టీవీలు ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో వర్టికల్ టీవీ సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నరసరావుపేట డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 486 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 65 శాతం చోరీలు జరిగిన సొమ్మును రికవరీ చేశామన్నారు. నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. వినుకొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న పోలీసు స్టేషనుల్లో సిబ్బంది కొరత భర్తీ చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. వ్యాపారస్తులు, గ్రామస్తులు దాతలు సహకారంతో నేరాల నియంత్రణ చేయటానికి అన్నీ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు పోలీసు అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. శావల్యాపురం పోలీసు స్టేషను పరిధిలో రికవరీ 45 శాతం ఉందని నేరాల పురోగతి బాగానే ఉందన్నారు. శావల్యాపురం సెంటరు గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో ఆటోలు వలన ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లుతోందని ఇద్దరు కానిస్టేబుల్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావును ఆదేశించారు. రానున్న రోజుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు వ్యవస్థలో పెను మార్పులు వస్తాయని తద్వారా ప్రజలకు సకాలంలో న్యాయసేవలు శరవేగంగా అందుతాయన్నారు. అనంతరం రూ.40 వేలు విలువ చేసే వర్టికల్ టీవీ వితరణ చేసిన గ్రామావాసి దాత మద్దినేని హరిబాబు (సీఏ) ప్రత్యేకంగా డీఎస్పీ అభినందించారు. పోలీసు స్టేషను ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆయనతో పాటు రూరల్ సీఐ బి.ప్రభాకర్ రావు, ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు, రైటరు షేక్ బాషా పోలీసు సిబ్బంది ఉన్నారు.

మద్యం దుకాణంలో చోరీకి విఫల యత్నం

- సీసీ కెమెరాలు ధ్వంసం
- దుకాణ తాళాలు పగుల గొట్టిన దుండగులు



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో మద్యం దుకాణంలో దుండగులు చోరీకి విఫల యత్నం చేసిన బుధవారం వెలుగు చూసింది. సేకరించిన సమాచారం ప్రకారం.. గ్రామంలోని మద్యం దుకాణంలో చోరీకి వచ్చిన ఆగంతకులు అక్కడ ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం మద్యం దుకాణ తాళాలను పగుల గొట్టారు. ఉదయం మద్యం దుకాణం తెరిచేందుకు వచ్చిన సిబ్బంది తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసి కంగారు పడ్డారు. దుకాణంలోకి వెళ్లి పరిశీలించగా ఉండాల్సిన నగదు, మద్యం నిల్వలు అలానే ఉన్నాయి. దుండగులు తాళాలు పగుల గొట్టి దుకాణంలోకి ప్రవేశించే సమయంలో జన సంచారం రావటంతో పారిపోయి ఉంటారని భావిస్తున్నారు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి స్కూబా డైవింగ్ క్యాంప్‌లో ఎన్‌సీసీ క్యాడెట్స్



నరసరావుపేట రూరల్: వైజాగ్ నావల్ కమాండ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 17నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన స్కూబా డైవింగ్ ట్రైనింగ్ క్యాంప్‌కు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ శిబిరానికి 480 మంది క్యాడెట్స్ హాజరుకాగా మెడికల్, స్విమ్మింగ్ పరీక్షలు నిర్వహించిన అనంతరం 110 మందిని ఎంపికచేసినట్టు తెలిపారు. కళాశాల సీనియర్ క్యాడెట్స్ డి.అప్పలనాయుడు, సి.హెచ్. మణికుమార్‌లు ఎంపికై జాతీయస్థాయి శిక్షణను పూర్తిచేసుకున్నట్టు వివరించారు. ప్రకృతి పట్ల మనకున్న కర్తవ్యాన్ని ఏ విధంగా నిర్వర్తించాలి, మానసిక ప్రశాంతతను ఏ విధంగా పెంపొందించుకోవాలి, సముద్రంలో నిక్షిప్తమైన సంపద, నిక్షేపాలు గురించి శిక్షణలో క్యాడెట్స్‌కు అవగాహన కల్పించినట్టు పేర్కొన్నారు. జాతీయస్థాయి స్కూబా శిక్షణలో పాల్గొన్న క్యాడెట్స్‌ను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ బాబులు అభినందించారు.

వైభవంగా లోక రక్షకుడి జన్మదినోత్సవం



క్రిస్మస్ సందేశాన్ని అందిస్తున్న తిమోతి



నాదెండ్లలో ఫాస్టర్ మోహన్‌రావు



నరసరావుపేట మిలీనియం తెలుగు బాప్టిస్టు చర్చిలో క్రైస్తవ గీతాలను ఆలపిస్తున్న యువత



నరసరావుపేటలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



కమ్మవారిపాలెంలో ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మతబోధకులు ప్రభుదాసు

- వాడవాడలా క్రిస్మస్ పర్వదిన వేడుకలు
- ప్రార్థనలతో కిక్కిరిసిన చర్చిలు

నరసరావుపేట ఈస్ట్: ప్రపంచ మానవాళికి క్రీస్తు ఏసు బోధనలు ఆచరణీయమని సంఘకాపరులు తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని క్రైస్తవ ప్రార్థనాలయాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు ఏసు జననాన్ని స్తుతిస్తూ క్రైస్తవ ప్రార్థనా గీతాలను ఆలపించారు. ఆయా చర్చిలలో సంఘకాపరులు క్రీస్తు ఏసు సందేశాన్ని అందించారు. స్టేషన్ రోడ్డులోని టౌన్ బాప్టిస్ట్ చర్చిలో ఎలీషా మున్నంగి, తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పేరపోగు తిమోతి, సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి (వెస్ట్)లో ఎన్.రత్నరాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

లోక రక్షణకే క్రీస్తు జననం

శావల్యాపురం: క్రిస్మస్ పర్వదినం వేడుకలు మండలంలో అన్నీ గ్రామాల్లో క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిట లాడాయి. ఏసుక్రీస్తు జన్మదినాన్ని క్రిస్మస్ పర్వదినంగా జరుపుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు ప్రార్థన మందిరాల్లో మత బోధకులు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనా మందిరాలు విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శావల్యాపురంలో రిడెంప్షన్ విమోచన ప్రార్థన మందిరంలో దైవజనులు సి.హెచ్.యెహెజ్కేలు మాట్లాడుతూ లోక రక్షణకే క్రీస్తు జన్మించినట్లు చెప్పారు. శాంతి పాప పరిహారం సర్వ మానవాళి రక్షణ కోసమే క్రీస్తు జన్మించారన్నారు. క్రీస్తు పుట్టుక మానవుని బ్రతుకులో మార్పు తీసికునిరావటం తద్వారా నవ సమాజస్థాపన చేయటానికి దోహదపడిందన్నారు. సాటి వ్యక్తులను ప్రేమించే తత్వమే క్రీస్తు తత్వమన్నారు. అనంతరం అన్నీ ప్రార్థన మందిరాల్లో క్రిస్మస్ కేకు కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు సంస్కృతిక కార్యక్రమాలు క్రీస్తు భక్తిగీతాలు ఆలపించారు. పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రార్థన మందిరాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకురాలు కస్తూరి, రాక్ ప్రశాంత్, నిశాంత్, సోమేపల్లి వెంకటేశ్వర్లు, చెరుకూరి సత్యనారాయణ, యడవల్లి వెంకట్రావు, బత్తుల బాబు, హనుమంతరావు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని అన్నీ గ్రామాల్లో క్రిస్మస్ సంబరాలు క్రైస్తవులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రార్థన మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని కమ్మవారిపాలెం గ్రామం ఎస్టీ కాలనీ ప్రార్థన మందిరంలో మతబోధకులు ప్రభుదాసు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ కేకు కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు ప్రభువు ప్రపంచానికి చేసిన లోకరక్షకుడిగా జన్మించి మానవులకు ప్రేమ, శాంతి కరుణ పంచారు. ఏసుక్రీస్తు మార్గంలో అందరూ పయనించాలన్నారు. అప్పుడే పాపులకు మోక్షమార్గం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో దైవజనులు రెవరెండ్ డాక్టరు బిల్లా విల్సన్ బాబు, గంగినేని బాబు, చంద్రబాబు, కంచుమాటి నరేష్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వాడవాడలా క్రిస్మస్ వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): క్రిస్మస్ పర్వనాన్ని పురస్కరించుకుని పలు చర్చిలల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పట్టణంలోని తెలుగుబాప్టిస్టు చర్చి, పల్నాడురోడ్డులోని ఆర్‌సియమ్‌చర్చి,లతోపాటు పలుగ్రామాలల్లో క్రైస్తవ సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చర్చిల్లో పాస్టర్లు దైవసందేశం అందించారు. ఏసుక్రీస్తు అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శనీయమని సూచించారు. క్రిస్మస్‌పర్వదినం సందర్భంగా అబ్దుల్‌కలామ్,థెరిస్సా సొసైయిటీ ఆధ్వర్యంలో పేదపిల్లలకు నూతన వస్త్రాలు బహుకరించారు. స్టునిర్వాహకులు చందోలు నాగవాణి పాల్గొని పిల్లలలకు నూతన వస్త్రాలుపంపిణీ చేశారు. అలాగే నియోజకవర్గంలోని నూజెండ్ల, వినుకొండ రూరల్ పరిధిలోని పమిడిపాడు, ములకలూరు, రవ్వారం, కంభంపాడు, దొండపాడు, వితంరాజుపల్లి, పెదకంచర్ల, తోపాటు పలుగ్రామాలల్లో చర్చిలల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నాదెండ్ల: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పురాతన చర్చిలైన కనపర్రు, చిరుమామిళ్ళ, తూబాడు, గొరిజవోలు, నాదెండ్ల, సాతులూరు, గణపవరంలో క్రైస్తవులతో చర్చిలు నిండిపోయాయి. గణపవరం గ్రేస్‌ఎబినేజర్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఫాస్టర్ పి.ఇస్సాకు, పి.దోరతి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రసాదం శ్రీను, వెంకటేష్ కుటుంబ సభ్యులు అందించిన ఆర్థిక సాయంతో 150 మంది వృద్ధులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి చేతుల మీదుగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. హెబ్రోను ప్రార్థనా మందిరంలో ఫాస్టర్ యడ్లపల్లి రమేష్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం అన్నదానం చేశారు. చవిటిపాలెంలోని బైబిల్ ఫెయిత్ లూథరన్ చర్చిలో జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 50 మందికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ దాసరి చిట్టిబాబు, సంస్థ ఉపాధ్యక్షుడు యాకోబు, మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు పాల్గొన్నారు. నాదెండ్ల చైతన్యనగర్ కాలనీలోని చర్చిలో ఫాస్టర్ మోహన్‌రావు క్రిస్మస్ విశిష్టతను వివరించారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: లోకరక్షకుడు ఏసుక్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని అన్ని చర్చిలు విశ్వాసులతో కిటకిటలాడాయి. యడ్లపాడు, తిమ్మాపురం, జాలాది, జగ్గాపురం, ఉప్పరపాలెం, మైదవోలు, లింగారావుపాలెం, సొలస, కొండవీడు, కారుచోల, బున్నీనగర్, ఉన్నవ, మర్రిపాలెం, వంకాయలపాడు, బోయపాలెం, సందెపూడి, తుర్లపాడు గ్రామాల్లో వేకువజామునుంచే ప్రత్యేక ప్రార్థనలు మొదలయ్యాయి. మధ్యాహ్నం 2గంటల వరకు చర్చిలు కిటకిటలాడాయి. నూతన వస్త్రాలు ధరించి మందిరాల వద్ద చిన్నరులు, మహిళలు, యువత సందడి చేశారు. దైవసేవకులు క్రిస్మస్ విశిష్టత గురించి వివరించారు. అలాగే క్రిస్మస్‌ను స్వాగతిస్తూ ముందురోజు రాత్రి 12 గంటలకు యువత కేక్‌లను కట్‌చేసి హ్యాపీహ్యాపీ క్రిస్మస్, మేరిమేరిక్రిస్మస్ అంటూ ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుతూ స్వీట్లను పంపిణీ చేశారు. రెండోరోజు మధ్యాహ్నం తిరిగి ప్రార్థనలు నిర్వహించారు.

పండ్లు పంపిణీ

యడ్లపాడు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పలహారం పంపిణీ చేశారు. నరేంద్రం, సువర్ణ

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను బుధవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చర్చీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గృహాలపై స్టార్‌లు, క్రిస్మస్ చెట్లను ఏర్పాటు చేశారు. క్రీస్తు జన్మదినాన్ని స్వాగతిస్తూ మంగళవారం రాత్రి గ్రామాల్లో పెద్ద ఎత్తున బాణసంచా మోగించి, కేక్‌లు కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు పుట్టుక, ప్రాముఖ్యతను ఫాస్టర్‌లు వివరించారు.

మానవాళికి ప్రేమ మార్గం చూపిన ఏసుక్రీస్తు



తండ్రి సన్నిధి చర్చిలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి విడదల రజిని

మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ఏసుక్రీస్తు మానవజాతికి ప్రేమ మార్గాన్ని చూపడానికే అవతరించాడని... ఆయన జీవితం ప్రపంచశాంతికి ఒక సందేశమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని భావన రుషినగర్‌లో ఉన్న తండ్రి సన్నిధి, పురుషోత్తమపట్నం బైపాస్ రోడ్డులో ఉన్న ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయం చర్చిల్లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ ఏసుక్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున హాజరైన క్రైస్తవులు, విశ్వాసులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ క్రీస్తు ప్రబోధాలను ఆచరించటమే నిజమైన క్రిస్మస్ అని చెప్పారు. లోక రక్షకుడు ప్రజలను పాపాల నుంచి రక్షించేందుకే జన్మించాడన్నారు. సత్యం, ధర్మం, శాంతి, సహనాలను ఏసుక్రీస్తు ప్రపంచానికి అందించారని పేర్కొన్నారు. ధర్మం కోసం అడుగులు వేసే ఎవరైనా సత్యాన్ని నిర్భయంగా ప్రకటిస్తారనేది క్రీస్తు జీవితం ద్వారా మనకు తెలుస్తోందని వెల్లడించారు. క్రీస్తు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి ప్రపంచశాంతికి పాటుపడాలని పిలుపు నిచ్చారు. తండ్రి సన్నిధిలో పాస్టర్ షాలేమురాజు, శాంతి నిలయంలో పాస్టర్ నంద మూరి క్రిస్టర్‌లు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్న, బండారు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట ఆర్‌సీఎం చర్చిలో కొవ్వొత్తులు వెలిగిస్తున్న చిన్నారులు



నూతన వస్త్రాలు వితరణ చేస్తున్న దైవసేవకులు సి.హెచ్.యెహెజ్కేలు



వినుకొండ తెలుగుబాప్టిస్టు చర్చిలో దైవసందేశం ఇస్తున్న ఫాస్టర్



యడ్లపాడు ఆర్సీఎం చర్చిలో వాక్యపోదేశం చేస్తున్న పాస్టర్ సుభాష్ చంద్రబోస్



కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యాన బుధవారం యడ్లపాడు గ్రామంలో జాతీయ రహదారి పక్కనేఉన్న ఎర్రకొండ వద్ద ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ సందర్భంగా రహదారి మాత కొండపైకి వచ్చే విశ్వాసులకు పండ్లు, స్వీట్లు ట్రస్ట్ ప్రతినిధులు వై.ప్రసాదరావు, కె.శిల్ప తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



వినుకొండలో పిల్లలకు నూతన వస్త్రాలు బహూకరిస్తున్న ట్రస్టు నిర్వాహకులు



గణపవరంలో నూతనవస్త్రాలు పంపిణీ చేస్తున్న వలేటి



తిమ్మాపురం లూథరన్ చర్చిలో బైబిల్ వాక్యబోధన చేస్తున్న పాస్టర్ డేవిడ్ సుదీప్‌సాగర్





తిమ్మాపురంలో ప్రార్థనకు హాజరైన విశ్వాసులు

రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి



బీజేపీ నాయకులతో కలసి వాజ్‌పేయి విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



అటల్‌జీ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చిలకలూరిపేట: రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకొని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో వాజ్‌పేయి క్యాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా వెంకట శివనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపీశ్రీనివాస్‌తో కలసి ఎమ్మెల్యే బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యర్థులు సైతం మెచ్చే అజాత శత్రువుగా పేరు గడించారని పేర్కొన్నారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి బిట్రా వెంకట శివనారాయణ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి గౌరవ ప్రదమైన రాజకీయాలను వాజ్‌పేయి ఆచరించారని చెప్పారు. బీజేపీని రెండు స్థానాల నుంచి అధికారానికి తీసుకువచ్చి, సుపరిపాలన అందించారని కొనియాడారు. భారతావని గర్వించే రాజకీయ శిఖరం, మచ్చలేని వ్యక్తి, కవి బహుముఖ ప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన దార్శనికుడు వాజ్‌పేయి అని కొనియాడారు. గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా గ్రామాలకు అనుసంధానిస్తూ దేశ వ్యాప్తంగా వేల కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేశారని వెల్లడించారు. అనంతరం అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, పలువురు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అటల్‌జీ శతజయంతి వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): భారతమాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ శతజయంతి వేడుకలు స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు కార్యకర్తలు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎ.సుధాకర్ బాబు పాల్గొని, మాట్లాడుతూ వాజ్‌పేయ్ హయాంలో దేశంలో అనేక సంస్కరణలు అమలు జరిగాయని ఫలితంగా దేశ అభివృద్ధిలో తనదైన ముద్రవేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సంస్థాగత ఎన్నికల అధికారి పి.వి.కృష్ణారెడ్డి, గోరంట్ల సత్యనారాయణ, మేడం రమేష్, రాఘవులతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూజెండ్లలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



వినుకొండ(నూజెండ్ల): మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామంలో ప్రధాన కూడలి మార్గంలోని రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామస్తులు ఐక్యంగా ఇరుకుగా ఉన్న రహదారి మార్గంలో ఆక్రమణలు తొలిగింపు పనులు పూర్తి చేసిన అనంతరం సెంట్రల్ డివైడరు లైటింగ్‌తో పాటు ఇరువైపులా సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులు చేశారు. ఏఈ అల్లాభక్షు మాట్లాడుతూ జాతీయ ఉపాధి పథకం నిధులు రూ.30 లక్షల వ్యయంతో 220 మీటర్ల మేర సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. మరెన్నో అభివృద్ధి పనులు చేస్తామన్నారు.

ఆగని వర్షపు జల్లులు

ఉరుకులు పరుగులు తీస్తున్న రైతులు



ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపుతున్న రైతులు, కూలీలు

రొంపిచర్ల: మండలంలో తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా బుధవారం కూడా వర్షపు జల్లులు కురుస్తున్నాయి. ఉదయానికి 2.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కష్టం మీద గోతాలకు నింపుకొని ఇళ్లకు చేర్చే పనిలో రైతులు సతమతమవుతున్నారు. కొందరు రైతులు కోసి ఓదెలపై ఉన్న పనలను పట్టలపై చేర్చి నూర్పిడి నిర్వహిస్తున్నారు. వరి కుప్పలు వేసిన రైతులు కుప్పల్లోకి వర్షపు నీరు దిగకుండా టార్బలిన్ పట్టలు కప్పి రక్షించుకుంటున్నారు. కోతకు సిద్ధమై నిలువు ఉన్న వరి పైరు నేలవారుతుంది. రెండు రోజులుగా హార్వెస్టింగ్ పనులు పూర్తిగా నిలిచి పోయాయి. కల్లాల క్రిందకు, ధాన్యం రాశుల క్రిందకు వర్షపు నీరు చేరకుండా ధాన్యం రాశి చుట్టూ కాల్వలు తీస్తున్నారు. ఏదిఏమైనా ఈ వర్షం వరి రైతాంగానికి అతలాకుతలం చేస్తూ రైతులను ఉరుకులు పరుగులు పెట్టిస్తుంది.

మిర్చి దెబ్బతినే అవకాశం

నాదెండ్ల: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మిర్చి రైతులు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారు. గత కొద్దిరోజులుగా మిర్చి కోతలు ప్రారంభమయ్యాయి. కోసిన మిర్చి కల్లాల్లో ఆరబోస్తున్నారు. తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో కల్లాల్లో ఆరబోసిన కాయలు తడిచి పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత మూడు రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిరుజల్లులతో వర్షం కురుస్తూనే ఉండటంతో రైతులు ఆరబోసుకునేందుకు వీలులేకుండా పోయింది. అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో రైతు కామినేని నాగేశ్వరరావు మూడెకరాల్లో మిర్చి సాగు చేశారు. ఎకరాకు రూ.1 లక్ష మేర సాగు ఖర్చులు అయినట్లు తెలిపాడు. కోసిన కాయలు తడుస్తుండటంతో దెబ్బతిని నష్టం తప్పదని వాపోతున్నాడు.



అమీన్‌సాహెబ్‌పాలెంలో తడిచిన మిర్చిని ఆరబోసుకుంటున్న రైతు



వరికుప్పపై వర్షపు నీరు దిగకుండా టార్బలిన్ పట్టలు కప్పిన రైతులు

వృద్ధురాలి మెడలో బంగారు చైను చోరీ

ఈపూరు (శావల్యాపురం): మండల కేంద్రం ఈపూరులో వృద్ధురాలి మెడలో బంగారు చైను లాక్కొని పోయిన సంఘటన చోటుచేసుకున్నట్లు ఎస్సై యం. ఉమామహేశ్వరావు బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు మేరకు గ్రామానికి చెందిన గుంటకల పేరమ్మ వృద్ధురాలు తన ఇంటిలో గత నాలుగు రోజుల నుంచి టీవీ ప్రసారాలు రావటం లేదని సాయిరామ్‌కు సమాచారం ఇచ్చింది. ఇదే అదునుగా భావించి పక్కనే ఉన్న మంచంపై వృద్ధురాలిని నెట్టి ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు చైను లాక్కొని పారిపోయాడు. ఈ ఘటనపై గుంటకల పేరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.